క్లుప్తంగా

నేడు దొడ్డా సక్కుబాయమ్మ సంస్మరణ సభ

● హాజరుకానున్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్, ఎమ్మెల్యేలు, సీపీఐ నాయకులు

చిలుకూరు : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు సతీమణి సక్కుబాయమ్మ సంస్మరణ సభను గురువారం చిలుకూరులో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సంస్మరణ సభకు ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు హాజరుకానున్నారు.

శివాలయ రాజగోపురం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్, ఈఓ తదితరులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయం దక్షిణ రాజగోపుర నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజర్ కొండారెడ్డి మాట్లాడుతూ రూ. 55 లక్షల వ్యయంతో రాజగోపురం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ధనంజయ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

పాలకవీడు : మండలంలోని కల్మేట్‌తండాలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారి రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సుమారు మూడు నెలలుగా తాగునీరు సరిగా అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వేగవంతంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

నేరేడుచర్ల : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగవంతంగా చేపడుతున్నట్లు తహసీల్దార్ సురగి సైదులు తెలిపారు. బుధవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల జిరాక్స్‌లను మున్సిపల్ కార్యాలయం, గ్రామ పంచాయతీల్లో సమర్పించాలని కోరారు. ఆయన వెంట ఆర్‌ఐ నర్సయ్య, మున్సిపల్ సిబ్బంది సైదులు తదితరులు ఉన్నారు.

ఆర్టిజన్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

హుజూర్‌నగర్ : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆర్టిజన్స్ సంఘం డివిజన్ నాయకుడు ఎంవీఎస్ చార్యులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో నిర్వహించిన ఆ సంఘం డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం యూనియన్ డివిజన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు పిడతల శ్రీనివాసరావు, శంకర్, భాస్కర్, విజయ్, సత్యబాబు, సైదులు, జితేందర్‌రెడ్డి, దేశ్యా, షణ్ముకాచారి, మట్టపల్లి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కవితపై బీజేపీ, కాంగ్రెస్‌ల కుట్ర

హుజూర్‌నగర్‌రూరల్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీ మద్యం కేసులో ఇరికించడం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కుట్రేనని తాజా మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గోపాలపురంలో బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు కవితకు బెయిల్ మంజూరు చేయడంతో న్యాయం గెలిచిందని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు షేక్ అలీపాషా, మల్లేపల్లి నర్సింహారావు, బాలసైదులు, వీరమల్ల సుందరయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మఠంపల్లి : మండలంలోని హనుమంతులగూడెం, యాతవాకిళ్ల, భీల్యానాయక్‌తండా, కామంచికుంటతండాల్లో అభివృద్ధి పనులను నేరేడుచర్ల ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారుల తనిఖీ బృందం బుధవారం పరిశీలించింది. హనుమంతులగూడెంలో చెత్త డంపింగ్ యార్డును, కామంచికుంట తండాలో తడి పొడిచెత్త సేకరణను, భీల్యానాయక్‌తండా, యాతవాకిళ్లలో మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. మరొక అధికారుల బృందం ఈసీ మహేష్ ఆధ్వర్యంలో బక్కమంతులగూడెం, చౌటపల్లి, రఘునాథపాలెం, గుండ్లపల్లిలో పరిశీలించారు. ఏపీఓ శేఖర్, టీఏలు బుంగయ్య, సతీష్‌రెడ్డి, నరసింహ, సత్రు, మల్సూర్, కార్యదర్శులు నాగిరెడ్డి, లక్ష్మణ్‌నాయక్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

కోదాడరూరల్ : మండల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనులపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 : 30 గంటలకు సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాంచందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మేట్లు, కూలీలు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆయకట్టులో సాగు పనులు

● ప్రారంభమైన వరి నాట్లు
● పలు గ్రామాల్లో కూలీల కొరత
● ముదిరిపోతున్న నార్లు
● మైనర్ కాల్వల చివరికి సాగు నీరు అందడం లేదని రైతుల ఆందోళన



పాలకవీడులో వరి నాట్లు వేస్తున్న కూలీలు

పాలకవీడు : మండల వ్యాప్తంగా సాగర్ ఆయకట్టులో సాగు పనులు ప్రారంభమయ్యాయి. జాన్‌పహాడ్ మేజర్ కాల్వ పరిధిలో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. కానీ పలు గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడింది. నాట్లు ఆలస్యమై ముందస్తుగా పోసిన నార్లు ముదిరిపోతున్నాయని దీంతో పంట దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక ఆర్-12, ఆర్-13, ఆర్- 14, ఆర్-15 మైనర్ కాల్వల చివరి భూములకు సాగునీరు అందడం లేదని దీంతో నాట్లు ఆలస్యమవుతున్నాయని ఆ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే జూలై నెలలో సాగునీరు అందడం కష్టమవుతుందనే ఆలోచనతో ఈ ప్రాంత కూలీలు నిజామాబాద్, కరీంనగర్, తదితర జిల్లాలకు కూలి పనులకు వలస వెళ్లారు. వారు తిరిగి రావడానికి ఆలస్యం కావడంతోనే కూలీల సమస్య ఏర్పడింది. ఉన్న కొద్దిపాటి కూలీలకు డిమాండ్ పెరిగింది.

పెరిగిన నాట్ల కూలి రేట్లు..

గత సీజన్‌లో ఎకరం నాటు వేసేందుకు రూ.3,500 ఉండగా ప్రస్తుతం నాలుగు నుంచి ఐదువేలకు పెరిగింది. రోజువారి కూలి రూ.500, రూ.600 చెల్లిస్తున్నారు. కూలి రేట్లు పెరుగడంతో కొందరు రైతులు వెదజల్లడం, డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. దీంతో పెట్టుబడి తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుందని అంటున్నారు. కాగా, మరో ఇరవై రోజులు వరినాట్లు కొనసాగేలా కనిపిస్తోంది.

18 వేల ఎకరాల్లో సాగు అంచనా..

మండల వ్యాప్తంగా సాగర్ ఆయకట్టు పరిధిలో సుమారు 18 వేల ఎకరాలు వరిసాగు అయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. దీనికి తోడు జాన్‌పహాడ్ పరిధిలో సుమారు వెయ్యి ఎకరాల్లో పత్తిసాగు చేపట్టారు. మైనర్ కాలువలకు దగ్గరలో ఉన్న భములు రైతులకు సమయానికి నీరందడంతో నాట్లు పూర్తిచేయగా కోమటికుంట, చెరువుతండా, జాన్‌పహాడ్, బెట్టెతండా గ్రామాల్లో 70 శాతం పొలాలు నాట్లు వేయాల్సి ఉంది. వానాకాలం నలభై రోజుల వరకు ముదురు నారును నాటుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. మరీ ఎక్కువ రోజులు నారు పెరిగిలే పైరు ఎదుగుదల లోపిస్తుందని, తద్వారా పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని అంటున్నారు.

ఎల్-34 లిఫ్ట్‌కు నీటి విడుదల



లిఫ్ట్ మోటార్ల ద్వారా వస్తున్న నీరు

సాక్షి ఎఫెక్ట్

నడిగూడెం : మండల కేంద్రం సమీపంలో గల నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న ఎల్- 34 ఎత్తిపోతల పథకానికి సాగు సీజన్ ప్రారంభమై నెల రోజులైనా నీటిని విడుదల చేయలేదు. దీంతో రైతులు సాగర్ నీటి కోసం ఎదురుచూస్తుండడంతో సాక్షి పత్రికలో ఈ నెల 26వ తేదీన ×ఎల్- 34 నిర్వహణ అస్తవ్యస్తం₹అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టి బుధవారం నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అజాజుద్దీన్ గెలుపునకు కృషి చేయాలి

నడిగూడెం : త్వరలో నిర్వహించనున్న జిల్లా యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా కోదాడకు చెందిన అజాజుద్దీన్‌ను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు నళినిరెడ్డి, ఉపాధ్యక్షుడు దున్నా శ్రీనివాస్, కార్యదర్శి వేపూరి సుధీర్, సీనియర్ నాయకులు దేవబత్తిని రమేష్ ప్రసాద్, పందిరి వెంకటరెడ్డి, గడ్డం మల్లేష్, బాణాల నాగరాజు, పురుషోత్తం, శ్రీను పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక



నడిగూడెంలో మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న అజీంబాబా

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14, అండర్ -17 విభాగాల్లో మండల స్థాయి క్రీడాకారులను ఎంపిక చేశారు. బాల, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖోలతో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎండి.అజీంబాబా, ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్, బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వాణి, ప్రధానోపాధ్యాయురాలు కరుణ, క్రీడల ఇన్‌చార్జ్ డి.సరళాదేవి, వ్యాయామ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి

పాలకవీడు : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చల్లా శ్రీలతారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పాలకవీడు మండలంలో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కష్టపడ్డ ప్రతిఒక్కరికీ మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, సభ్యత్వ నమోదు మండల ఇన్‌చార్జ్ రమావత్ నరినాయక్, వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, మంద లాజరు, కొండ శ్రీను, నాగరాజు, కృష్ణారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హుడ్రా ఏర్పాటు చేయాలి

హుజూర్‌నగర్ : హైడ్రా మాదిరిగా హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో హుజూర్‌నగర్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హుడ్రా) ఏర్పాటు చేసి హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలోని చెరువులు, కుంటలను కబ్జాదారుల నుంచి కాపాడాలని ఓయూ జేఏసీ నాయకులు సోమగాని నరేందర్ గౌడ్, ప్రజా కళాకారుడు బాదె నర్సయ్య కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు దార మనోహర్, క్రాంతి, చిన్న రామయ్య, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించి అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండపల్లి వాసు, జిల్లా ఆర్గనైజర్ జగిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : ఉట్టి కొడుతున్న యువకులు



కోదాడరూరల్ : చిన్నారులకు బహుమతులు ఇస్తున్న అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు

సీతారామచంద్రస్వామి ఆలయంలో..

హుజూర్‌నగర్ : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్ర స్వామి ఆలయంలో యాదవులు బుధవారం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకం, పుష్పాలంకరణ, తులసి పూజ, ఆరగింపు, మంగళాశాసనం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఈఓలు గుజ్జుల కొండారెడ్డి, లక్ష్మణ్‌రావు, అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, జగన్నాథాచార్యులు, యాదవులు ఉన్నారు.

రేషన్ కార్డు లేని రైతులకూ రుణమాఫీ



నడిగూడెం : రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

నడిగూడెం : రేషన్ కార్డు లేని అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుందని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ తెలిపారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో రేషన్ కార్డు లేని రైతులకు రుణమాఫీ చేసేందుకు కుటుంబ ధృవీకరణ పత్రాలను, గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో 916 మంది రైతులు ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని, బుధవారం 45 దరఖాస్తులను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.సరిత, మండల వ్యవసాయాధికారి దేవప్రసాద్, ఏఈఓలు పిచ్చయ్య, మౌనిక, రేణుక, రైతులు పాల్గొన్నారు.

రుణమాఫీకి దరఖాస్తుల వెల్లువ

మునగాల : మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించారు. దీంతో బుధవారం రుణమాఫీ కోసం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బుంగా రాజు మాట్లాడుతూ మండలంలో వివిధ బ్యాంకులలో అకౌంట్ ఉన్న 2441 మంది రైతులకు రేషన్‌కార్డు లేకపోవడంతో రుణమాఫీ పథకం అమలు కాలేదన్నారు. దీంతో వారి నుంచి కుటుంబసభ్యుల వివరాలతో కూడిన దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. బుధవారం 112 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు మాచర్ల రమ్యతేజ, మేడిశెట్టి ఉషశ్రీ, బాణోతు నాగు, చిక్కుల భవాని పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతుల నిర్ధారణపై సర్వే

నడిగూడెం : మండలంలో రుణమాఫీ కానీ రైతుల కోసం వారి కుటుంబ సభ్యుల నిర్ధారణపై బుధవారం నుంచి సర్వే చేపట్టినట్లు ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి ఆర్.దేవప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ కాని రైతులు ఆయా గ్రామాల్లో అధికారులకు అందుబాటులో ఉండాలన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

పాలకవీడు : రుణమాఫీ అమలు కాని రైతులు రైతు వేదికల్లో ఏఈఓలను సంప్రదించాలని వ్యవసాయ విస్తరణ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రైతులు తమ కుటుంబ ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు, పట్టా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో సంప్రదించాలని కోరారు.

నేరేడుచర్ల : వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జావేద్ తెలిపారు. బుధవారం నేరేడుచర్ల మండలంలో రుణమాఫీ కాని రైతుల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రుణమాఫీకి సంబంధించి కుటుంబ సభ్యుల వివరాలు ధృవీకరణ కాని వారు, బ్యాంకులలో రుణం తీసుకున్న రైతులు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● జెడ్పీ సీఈఓ అప్పారావు



పెదవీడులో వీధులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అప్పారావు

మఠంపల్లి : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిషత్ సీఈఓ అప్పారావు అన్నారు. బుధవారం మఠంపల్లి మండల కేంద్రంతో పాటు పెదవీడు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. అదేవిధంగా మఠంపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు జ్వరాల బారిన పడటంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మండల పరిషత్‌ను సందర్శించారు. ఉద్యోగులు సమయానుకూలంగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం పెదవీడులో పర్యటించి జ్వరపీడితులను పరామర్శించారు. గ్రామంలో పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ హరిసింగ్, కార్యదర్శులు విజయ, రాజా, వైద్య సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న ఫీవర్ సర్వే

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్య చర్యలు, ఫీవర్ సర్వే కొనసాగుతోంది. బుధవారం మున్సిపల్ అధికారులు 21, 28వ వార్డుల్లో డెంగీ జ్వరంతో ఉన్న వారిని గుర్తించి వారి గృహాల చుట్టూ, పరిసర ప్రాంతంలో గ్లైఫొసెట్, టెమోఫాస్ ద్రావణం పిచికారీ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్, మెప్మా సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే పరిశీలన

చిలుకూరు : గ్రామాల్లో ప్రతిఒక్కరూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. చిలుకూరులో కొనసాగుతున్న ఫీవర్ సర్వేను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, వైద్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరపీడితులకు సకాలంలో వైద్యం అందించాలి

పాలకవీడు : జ్వరపీడితులకు సకాలంలో వైద్యం అందించాలని పంచాయతీరాజ్ మండల ప్రత్యేక అధికారి ఎస్.శంకర్, ఎంపీడీఓ లక్ష్మి హెల్త్ సబ్ సెంటర్ల వైద్యులను కోరారు. బుధవారం మండల కేంద్రంలో వారు మండల వైద్యాధికారి నాగిమణితో సమావేశమై మాట్లాడారు. మండలంలోని అనేక గ్రామాల్లో ప్రజలు విషజ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. డెంగీ, చికున్ గున్యా వంటి జ్వరాలతో రక్త కణాల సంఖ్య తగ్గుతున్నాయని అందుకు తగిన వైద్యం అందించడమే కాకుండా ప్రజలు ఆందోళన చెందకుండా చైతన్యపరచాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి బాలికల ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వైద్యులు శ్రీనివాస్, ఎస్‌ఓ విజయ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

● మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆరోపించారు. బుధవారం కోదాడలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం రైతులను నిలువున మోసం చేసిందన్నారు. కేవలం 35 నుంచి 40 శాతం మంది రైతులకే రుణమాఫీ చేశారని, 60 శాతం మంది రైతులకు అన్ని అర్హతలున్నా రుణమాఫీ కాలేదని అన్నారు. హైడ్రాను తాము స్వాగతిస్తున్నామని, అదే సమయంలో ప్రతి పక్షాలను టార్గెట్ చేస్తే సహించబోమన్నారు. కాలువల చివరి భూములకు, లిఫ్టుల పరిధిలోని రైతులకు సాగునీరు సక్రమంగా అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు ఎస్‌కే. నయీం, జానకిరామాచారి, భూపాల్‌రెడ్డి, సత్యబాబు, అఫ్జల్, నాగమణి, వెంకట్, రాంబాబు, ఉపేందర్, అబ్బు, బోసు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం



పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కోటాచలం

మునగాల : జ్వర పీడితులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం కోరారు. మండల కేంద్రంలోని పాత సివిల్ ఆసుపత్రి ఆవరణలో రూ.1.56 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవనం ముందు శిథిలావస్థలో ఉన్న పాత సివిల్ ఆసుపత్రి భవనాన్ని తొలగించిన తర్వాత నూతన భవనం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఇటీవల జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో పలువురు ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎలాంటి అనుమతులు లేకుండా క్లినిక్‌లు, ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకొని పరిమితికి మించి ప్రజలకు చికిత్సలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేపాల, మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నాలుగు ఉప కేంద్రాలు ఉండగా అక్కడ మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.పి.రవీందర్, నూతన భవనం కాంట్రాక్టర్ షేక్ గౌస్, పిహెచ్‌సి సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

కోదాడరూరల్ : బీసీ విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గాలి శ్రీనివాస్‌నాయుడు, ఉపాధ్యక్షులు పాలంపల్లి సుధాకర్‌గౌడ్‌లు కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల ఫీజ్ రియింబర్స్ మెంట్ విడుదల చేయాలని, హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయాలని కోరారు. బీసీ కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద విద్యార్థుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఫీజు రియింబర్స్‌మెంట్‌తో అనేక మంది, బీసీ, ఈబీసీ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నారని అలాంటి పథకాన్ని నిర్వీర్యం చేయకుండా పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వారు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.

పాడిగేదెల పెంపకం లాభదాయకం



చిలుకూరు : మాట్లాడుతున్న డాక్టర్ వీరారెడ్డి

మునగాల : గ్రామీణ ప్రాంతాల్లో పాడి గేదెల పెంపకం లాభదాయకమని మోతె మండల పశువైద్యాధికారి కొప్పుల శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాడి గేదెల పోషణ చేపట్టిన మునగాల, మోతె, నడిగూడెం మండలాలకు చెందిన మహిళలకు బుధవారం మునగాల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 'మహిళా శక్తి'లో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పాడి గేదెలకు వైద్యచికిత్సలు అందించేందుకు పశువైద్యశాలలో సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. అనంతరం శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ నాగమణి మాట్లాడుతూ.. పాడిగేదెల పోషణ చేపట్టే మహిళలకు శ్రీనిధి ఒక్కొక్కరికి రూ.93, 270ల రుణం అందిస్తుందని, ఈ రుణాన్ని లబ్ధిదారులు 48 నెలల్లో నెలకు రూ.2,548ల చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మునగాల, నడిగూడెం మండలాల పశువైద్యాధికారులు డాక్టర్ అఖిల, డాక్టర్ మమత సెర్ప్ ఏపీఎం నాగెల్లి నగేష్ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిపై మహిళలు దృష్టి సారించాలి

చిలుకూరు : పాల ఉత్పత్తిపై మహిళలు దృష్టి సారించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ వీరారెడ్డి అన్నారు. పాడి పరిశ్రమలో భాగంగా ఎంపిక చేసిన లబ్ధిదారులకు బుధవారం చిలుకూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో చిలుకూరు మహిళా మండల సమాఖ్య ఆధ్వర్యంలో డైరీపై వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూడలకు, గేదెలకు నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా వేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు రమాదేవి, సీసీ గురుమూర్తి, కార్యదర్శి జ్యోతి, సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో జాన్‌పహాడ్ రోడ్డు విస్తరణలో భాగంగా గతంలో పెట్టిన హద్దులు దాటి ఆక్రమించిన వారు కట్టడాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి సూచించారు. బుధవారం జాన్‌పహాడ్ రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన కొలతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు ఆక్రమణలను పరిశీలించి మాట్లాడారు. కాల్వ నిర్మాణాలు జరగని చోట రోడ్డుకు ఇరువైపులా 33 అడుగులలోపు ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ప్రధాన కూడళ్లలో రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారుల బండ్లు పెట్టుకునేందుకు స్థలం అద్దెకు ఇస్తున్నారని పలువురు తమ దృష్టికి తీసుకరాగా పోలీస్‌ల సహకారంతో తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ మాట్లాడుతూ.. రోడ్డు పూర్తి కాగానే డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్ పనులను కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు చెప్పటినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో కాంగ్రెస్ నాయకుడు, పేద కుటుంబానికి చెందిన పాతకోటి రామకృష్ణ తల్లి మైసమ్మ ఇటీవల మృతి చెందారు. బుధవారం బాధిత కుటుంబానికి స్థానిక కాంగ్రెస్ నాయకుడు జక్కుల గురువయ్య ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం అందజేశారు. మాజీ సర్పంచ్ బుడిగె కాశయ్య, నాగరాజు, వెంకటరెడ్డి ఉన్నారు.

నేడు నడిగూడెంలో భోజనశాల ప్రారంభం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరం ఆవరణలో నిత్యాన్నదానం కోసం దాతల సహకారంతో నిర్మించిన భోజనశాలను గురువారం ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఓటరు జాబితా సవరించాలని వినతి

నడిగూడెం : ఓటరు జాబితా సవరించాని కోరుతూ టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వల్లపు నాగేశ్వరరావు, షేక్.జహీర్, వీరన్న, పిచ్చయ్య, సాయి పాల్గొన్నారు.

నేడు సిరికొండకు ఎమ్మెల్యే పద్మావతి రాక

మోతె : మండలంలోని సిరికొండకు గురువారం ఎమ్మెల్యే పద్మావతి రానున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురుదేవ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళకు రక్తదానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మహిళకి రక్తం అత్యవసరం కావడంతో జన చైతన్య ట్రస్ట్ అధ్యక్షుడు పారాసాయి.. స్థానికుడు వేముల నాగరాజుతో 'బి పాజిటివ్' రక్తం ఇప్పించారు. దీంతో పేషంట్ బంధువులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నడిగూడెం : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆమె పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. జ్వరపీడితులు, వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఎంపీఓ విజయకుమారి, పంచాయతీ కార్యదర్శి దుర్గా ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు నివాళి

కోదాడరూరల్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గణపవరం మాజీ ఉప సర్పంచ్ జాబిశెట్టి శ్రీనివాసరావు (54) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో టీపీసీసీ డెలిగేట్ సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, వెంకటాచారి, వెంకటేశ్వరరావు, శేషు, ప్రసాద్, నారపరెడ్డి ఉన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

నేరేడుచర్ల : మండలంలోని కల్లూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, హెచ్‌ఎం వెంకటనర్సయ్య, ఉపాధ్యాయులు రామారావు, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ నాగరాజు, క్లబ్ సభ్యులు రంగారెడ్డి, నాగార్జున ఉన్నారు.